క్లుప్తంగా

5 గ్రామాల్లో పోలీస్ పికెట్

రావికమతం: కౌంటింగ్ సందర్భంగా మండలంలో అల్లర్లు జరగకుండా సమస్యాత్మకమైన అయిదు గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని రావికమతం, కొత్తకోట ఎస్‌ఐలు ధనంజయ్ నాయుడు, లక్ష్మణరావు సోమవారం తెలిపారు. రావికమతం స్టేషన్ పరిధిలో గొంప, చినపాచిల, మేడివాడ, తట్టబంద గ్రామాల్లోనూ కొత్తకోట స్టేషన్ పరిధిలో కొత్తకోట, టి.అర్జాపురం గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. మండల వ్యాప్తంగా ఒక మొబైల్ టీమ్ తిరుగుతోందని, అల్లర్లకు పాల్పడే వారిని అరెస్ట్ చేసి లోపల వేసేస్తామని స్పష్టం చేశారు.

ఖరీఫ్ పనులకు రైతుల శ్రీకారం



శంకరంలో రైతులు తయారు చేసిన వరి నారుమడి

మాడుగుల రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో ఖరీఫ్ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. మెట్ట భూముల్లో చెరకు దవ్వనాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. సుమారు రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులుతో భారీ వర్షం కురిసింది. చెరకు పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు. తాచేరు, శారదా నదిలో వాన నీరు చేరింది.

వ్యాయామంతో ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: వ్యాయామంతో చక్కటి ఆరోగ్యాన్ని పొంది, చదువులో చురుగ్గా ఉంటారని విద్యార్థులకు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు. వజ్రాసనంతో పాటు పలు ఆసనాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచించారు.

అవగాహనతో మలేరియా దూరం



ర్యాలీలో గొలుగొండ పీహెచ్‌సీ సిబ్బంది

గొలుగొండ: వైద్య సిబ్బంది ఇచ్చే సూచనలు, సలహాలు పాటిస్తే మలేరియా దరిదాపులకు రాదని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గొలుగొండ పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30 వరకు ప్రతీ గ్రామంలో మలేరియా జ్వరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమలను నివారిస్తే మలేరియా వంటి విషజ్వరాలకు చెక్ పెట్టవచ్చన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రేయింగ్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం ఆడారి రామకోటి –వెంకట పద్మ దంపతులు రూ.25వేలను విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పెద్దలు ఆడారి జగన్నాథరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే ప్రజా తీర్పు

- ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- 262 బూత్‌లు..14 టేబుళ్లు
- 19 రౌండ్లలో ఫలితాల వెల్లడి
- కౌంటింగ్ కేంద్రానికి తరలిన పోస్టల్ బ్యాలెట్లు
- అభ్యర్థుల గెలుపుపై అందరిలో ఉత్కంఠ



విక్టరీ గుర్తు చూపుతూ కౌంటింగ్ కేంద్రానికి బయలుదేరిన నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్

నర్సీపట్నం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేవలం కొన్ని గంటలు వ్యవధిలో జరగనుండటంతో ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ పెరుగుతోంది. నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నం, గ్రామాల్లో ఎక్కడ చూసినా కౌంటింగ్‌పై చర్చ జరుగుతోంది. మంగళవారం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. నర్సీపట్నం నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు అనకాపల్లి శంకరం గ్రామం, కలెక్టరేట్ వద్ద గల ఫ్యూచర్ వరల్డ్ స్కూల్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. నర్సీపట్నం ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్లను ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు.

21 రోజుల ఎదురుచూపులకు తెర

2019 ఎన్నికల ఫలితాలకు 41 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ ఎన్నికల పోలింగ్ మే 13న జరగ్గా.. ఫలితాల కోసం 21 రోజుల ఎదురు చూపులకు నేటితో తెరపడనుంది. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను ప్రజలు భారీ మెజారిటీతో ఆదరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం చేసి చూపించారు. ఆనాటి పరిస్థితులు ఈ ఎన్నికల ఫలితాల్లో పునరావృతమవుతాయని పార్టీ శ్రేణుల్లో ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఉమాశంకర్ గణేష్, కౌంటింగ్ ఏజెంట్లతో కలిసి సోమవారం సాయంత్రమే కౌంటింట్ కేంద్రానికి బయలుదేరారు. చిరునవ్వుతో విక్టరీ గుర్తును చూపుతూ ఆయన జిల్లా కేంద్రానికి పయనమయ్యారు.

19 రౌండ్లలో లెక్కింపు

ఓట్ల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలు కానుంది. ఫలితాలపై ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇటు ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నర్సీపట్నం నియోజకవర్గంలోని 262 పోలింగ్ బూత్‌ల లెక్కింపు 19 రౌండ్లలో జరగనుంది. ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 3,196 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు మరో రెండు టేబుళ్లు సిద్ధంగా ఉంచారు. సాయంత్రం 4 గంటల లోపు విజయం ఎవరిని వరించిందనే విషయం తేలనుంది.

'మాడుగుల' కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మాడుగుల రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అనకాపల్లి సమీపంలోని కలెక్టర్ కార్యాలయం పక్కన్న కళాశాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మాడుగుల నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, స్థానిక తహసీల్దార్ టి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 17 రౌండ్లలో ఓట్లు లెక్కిస్తారు. దీనికి గాను 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 2,817 పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపునకు మూడు రౌండ్లలో జరుగుతుందని, దీనికి రెండు టేబుళ్లు ఏర్పాటు చేపినట్లు చెప్పారు. తొలిత మాడుగుల మండలంలోని కృష్ణంపాలెం తొలి బూత్ నుంచి లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివవచ్చి ఓట్లు వేశారన్న భరోసాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- సిబ్బందికి ఎస్‌ఐ, ఎంపీడీవోల ఆదేశాలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ రామారావు, ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం: గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని నాతవరం ఎస్‌ఐ రామారావు, ఎంపీడీవో జాగరపు రాంబాబు సిబ్బందికి సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు, రెవెన్యూ అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో రాజకీయ పార్టీ నాయకుల మధ్య వివాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు సిబ్బందిని నియమించి, ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. వివాదాలకు తావు లేకుండా ముందుగా ఇరువురి నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఏ పార్టీ అభ్యర్థులు గెలిచినా ఊరేగింపులు, బాణసంచా, విజయోత్సవ ర్యాలీలు నిషేధించామన్నారు. ఎన్నికల కమిషనర్ ప్రత్యేక ఆదేశాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే పరిస్థితులున్నాయని అనుమానం ఉన్నా వెంటనే సమాచారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా అందరికీ ఇబ్బందులు ఎదురవుతాయని దృష్టిలో ఉంచుకోవాలని తెలియజేశారు.

భారీ వర్షంతో ఊరట



నాతవరం కొండయ్య చెరువులో చేరిన వర్షం నీరు



రహదారిలో కూలిన చెట్లు

కె.కోటపాడు: మండల గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇటీవల వేసవి ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు జడివానతో సేద తీరారు. వర్షంతోపాటు ఈదురుగాలులు వీయడం వల్ల మండలంలో గొండుపాలెం, ఆర్లి మార్గాల్లో రోడ్లు పక్కన చెట్లు నేలకొరిగాయి. సోమవారం ఉదయం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు.

కుండపోత వర్షం

గొలుగొండ: మండల పరిధిలోని లింగంపేట, ఏఎల్ పురం, గొలుగొండ, చీడిగుమ్మల, ఎర్రవరం, పాత మల్లంపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి దాటినప్పటి నుంచి సోమవారం ఉదయం 7గంటల వరకు కురిసిన వర్షానికి ధారగెడ్డ నుంచి వర్షం నీరు ప్రవహించి, తాండవ జలాశయానికి చేరింది. పంట పొలాల్లోనూ నీరు చేరింది. ఇప్పటికే రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం అవుతున్నారు. నారుమడులు సిద్ధం చేసిన రైతులు వాతావరణం మరింత చల్లబడితే వరినార్లు వేస్తామని చెబుతున్నారు.

ఉపాధి పనులకు వర్షం దెబ్బ

నాతవరం: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నీరు చేరడంతో ఉపాధి హామీ పనులకు ఆటంకం కలిగింది. మండల పరిధిలో ఒక్క రోజుకు సుమారు 12వేల మందికి పైగా ఉపాధి కూలీలు పని చేస్తున్నారు. అయితే, వర్షం కారణంగా చెరువుల్లో, పంట కాలువల్లో నీరు చేరడంతో సోమవారం 6వేల మంది ఉపాధి కూలీలకు మాత్రమే పని కల్పించారు. అవి కూడా ట్రెంచ్‌లు, పోడు భూముల్లో రాతిపేర్పు వంటి పనులు చేపట్టారు. జిల్లాలో నాతవరం, మాకవరపాలెం మండలాల్లోనే ఉపాధి హామీ పథకంలో కూలీలు అధికంగా పని చేస్తున్నారు. వర్షాల కారణంగా ఆ సంఖ్య గణనీయంగా తగ్గింది. అయితే, ఆరు తడి పంటలకు ఈ వర్షం జీవం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగుకు నారుమడులు తయారు చేసుకోవడానికి ఈ వర్షం అనూకూలిస్తుందని పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ

దేవరాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దేవరాపల్లిలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన శిబిరంలో 120 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శిబిరానికి వచ్చిన ప్రజలకు వివరించి, ఉచితంగా మందులు అందజేశారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ భవానీ, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ హరిచందన, క్యాంప్ కో ఆర్డినేటర్ అశ్వినికుమార్, నర్సింగ్ స్టాఫ్ దేవి, స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వర్షా కాలం నేపథ్యంలో ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చౌడువాడ సీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల సూచించారు. గొండుపాలెంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను నిర్వహించారు. 139 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలను నిర్మల చేశారు. మురుగునీటి నిల్వలు ఉంటే దోమకాటు వల్ల ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడే పరిస్థితి ఉంటుందని ఆమె తెలిపారు. దోమలు నిర్మూలన వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందగలరని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కనకవేణి, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

బాలలకు చిత్రలేఖన పోటీలు



తాము వేసిన డ్రాయింగ్స్‌తో బాలలు




కథల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు సోమవారం ఆటల పోటీలతో పాటు డ్రాయింగ్, కథలు, బుక్ రీడింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల 15 నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బాగా చిన్నారులకు ఆటపాటలతో పాటు పుస్తకాలు చదివించడం, నీతి కథలు చెప్పడం వంటివి చేస్తున్నారు. బాలలకు ఏయే కళలపై ఆసక్తి ఉందో తెలుసుకుని, వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు. అందులో భాగంగా సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వీరందరికీ జూన్ 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ వరహామణి తెలిపారు.

చిన్నారులకు కథల పోటీలు

మాడుగుల రూరల్: కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులు, చిన్నారులకు కథలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అటెండర్ వి.శృతి ఆధ్వర్యంలో ప్రతి రోజు విద్యార్థులకు విజ్ఞానాన్ని ఇచ్చే కథలు, కథానికలు, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



తాళ్లపాలెం హైస్కూల్‌లో కలుసుకున్న 1993-94 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూలులో 1993–94లో టెన్త్ చదివిన టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక సోమవారం జరిగింది.ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు అమీర్, చల్లారావు, రమేష్, అనులను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు. చివరిగా విద్యార్థులు గ్రూప్ ఫొటో దిగారు.

144 సెక్షన్ అమలుపై పోలీసుల మైక్ ప్రచారం



రావికమతంలో మైక్ ప్రచారం చేస్తున్న పోలీసులు

రావికమతం: జూన్ 4వ తేదీన కౌంటింగ్ దృష్ట్యా ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురికి మించి జనం ఉండరాదని రావికమతం, కొత్తకోట పోలీసులు సోమవారం గ్రామాల్లో మైక్ ప్రచారం చేశారు. అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలుపై స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఆటో ద్వారా మైక్ ప్రచారం చేయించారు. దుకాణాల వద్ద, ప్రధాన కూడళ్లలో జనాలు గుంపులుగా ఉండరాదని తెలిపారు. సభలు, సమావేశాలు ర్యాలీలు, ధర్నాలు పూర్తిగా నిషేధమని తెలియజేశారు. అతిక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి



మృతి చెందిన పాడి గేదె వద్ద రోదిస్తున్న యజమాని

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో సోమవారం వేకువజామున పిడుగు పాటుకు మాసాడ శంకర్రావుకు చెందిన సుమారు రూ.90 వేల విలువ గల ముర్రా జాతి చూడి గేదె మృతి చెందింది. ఈ విషయాన్ని రోలుగుంట పశువైద్యాధికారి సూకేశ్వర్రావుకు గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ తెలియజేశారు. వెంటనే ఆయన సంఘటన స్థలానికి వచ్చి, స్థానికులను విచారించారు. పోస్టుమార్టం చేసి నివేదిక తయారు చేశారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని పశువైద్యుడిని కోరారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ



ప్రాజెక్టుకు మోటార్లను అమర్చుతున్న సిబ్బంది

మాకవరపాలెం: ఎట్టకేలకు లచ్చన్నపాలెం ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామ శివారులో ఉన్న సర్పానదిలో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా సుమారు 25 గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా ప్రాజెక్టుకు ఉన్న మూడు మోటార్లు కాలిపోయాయి. దీంతో గత ఆరు రోజులుగా మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు మోటార్లకు మరమ్మతులు పూర్తి కావడంతో సోమవారం సాయంత్రం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



తామరం జంక్షన్ వద్ద బోల్తా పడిన కారు

మాకవరపాలెం: రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న కారు సోమవారం తెల్లవారుజామున మండలంలోని తామరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వర్షం కారణంగా అదుపుతప్పి, డివైడర్ పైకి దూసుకుపోయింది. ఆ వెంటనే కారు బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడగా కారు ఇంజిన్ భాగం దెబ్బతింది.

మాడుగుల మోదమాంబను దర్శించుకున్న ధర్మశ్రీ



కరణం ధర్మశ్రీకి అమ్మవారి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు

మాడుగుల రూరల్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, మాడుగుల మోదకొండమ్మా అమ్మవారిని సోమవారం చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, కరణం ధర్మశ్రీ దర్శించుకుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు సాదరంగా ఆహ్వానించి, సత్కరించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకటరావు, మాజీ అధ్యక్షులు పుట్టా మురళీకృష్ణ, సయ్యపురెడ్డి సత్తిబాబు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర పెరిగింది. కిలోకి రూ.10 అదనంగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగింది. ఇక ఉల్లిపాయ, వంకాయ రూ.30, దొండకాయ,బెండకాయ రూ.40, బీరకాయ రూ.50, గోరు చిక్కుడు, బరబాటి, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. మామిడి, ఇతర పండ్ల అమ్మకాలు ఎక్కువగా సాగాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో మామిడి పండ్లు ఎక్కువగా సంతకు విక్రయానికి వచ్చాయి. బంగినపల్లి, సురేఖ వంటి ఉత్తమ రకాలతోపాటు రసాలు రకం పండ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. డజన్ 200 నుంచి రూ.300 వరకు పరిమాణం,రకం అనుసరించి అమ్మకాలు సాగాయి. ఈ వారం అనాస పండ్లు కూడా ఎక్కువగా అమ్మకానికి వచ్చాయి. వీటిని పరిమాణం అనుసరించి ఒక్కొక్కటి రూ.50 నుంచి రూ.70కి విక్రయాలు జరిగాయి. సపోటా కిలో రూ. వందకు విక్రయించారు.

అమరజీవికి నేడు నివాళి

అనకాపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నామకరణ చేసి నేటికి 16 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కార్మిక లోకానికి ఆదర్శం సత్యనారాయణ జీవితం

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గ ప్రయోజనాల కోసం దేశంలో సీఐటీయూ ఏర్పాటు చేసిన పరస సత్యనారాయణ ఆశయ సాధనకు కార్మిక లోకం కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సత్యనారాయణ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట వీరుడు కామ్రేడ్ సత్యనారాయణ శత జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తన జీవితాంతం బడుగు బలహీన వర్గాలు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కృషి చేసి చిరస్థాయిగా నిలిచినట్టు తెలిపారు. నేటి సమకాలీన రాజకీయాలలో నిస్వార్థంగా పనిచేయడంతో పాటు, ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల నిర్బంధాలను, ఆటుపోట్లు తట్టుకొని నిలబడిన సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యల పోరాటానికి సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరానికి నికార్సయిన ఆదర్శ మూర్తి సత్యనారాయణ అని కొనియాడారు. సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.నాగేషు, జిల్లా అధ్యక్షుడు శంకరరావు పాల్గొన్నారు.